## సింగరేణి జాయింట్ వెంచర్‌ను ఒప్పుకోం

### తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ స్పష్టం

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : రామగుండం థర్మల్ ప్లాంట్‌ను సింగరేణి భాగస్వామ్యంతో నిర్మించేందుకు ఎట్టి పరిస్థితిలో ఒప్పుకునేది లేదని, ఈ ప్లాంట్‌ను జెన్‌కో ద్వారానే నిర్మించాలని తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ స్పష్టం చేసింది. జాయింట్ వెంచర్ అంటే ప్రైవేటీకరణను ప్రోత్సహించడమేనని జేఏసీ నేతలు ఆరోపించారు. జేఏసీ ఉద్యమ కార్యాచరణలో భాగంగా శనివారం ఖైరతాబాద్‌లోని విద్యుత్ సౌధలో జేఏసీ నేతలు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ సాయిబాబా మాట్లాడుతూ.. మూడేండ్లుగా జెన్‌కో లాభాల్లో నడుస్తున్నదని, 2020-21లో రూ. 168 కోట్లు, 2021-22లో రూ.394.46 కోట్లు, 2022-23లో రూ.472.94 కోట్ల లాభాలను ఆర్జించిందని తెలిపారు. జెన్‌కో ఈక్విటీతోనే రామగుండంలో నిర్మించతలపెట్టిన 800 మెగావాట్ల ప్లాంట్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ రత్నాకర్‌రావు, కో కన్వీనర్ బీసీ రెడ్డి, వజీర్, మాజీద్, రమేశ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఉత్పత్తి లక్ష్యం పెంపు

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : బొగ్గు ఉత్పత్తి, రవాణాలో సింగరేణి లక్ష్యాన్ని క్రమంగా పెంచుకుంటున్నది. ఇది వరకు రోజుకు రెండు లక్షల బొగ్గును ఉత్పత్తి, రవాణా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ.. తాజాగా దీనిని 2.1 లక్షల టన్నులకు పెంచుకున్నది. బొగ్గు ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని కంపెనీ సీఎండీ ఎన్ బలరాం ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో పాటు రోజుకు 15 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించాలని అన్ని ప్రాంతాల జీఎంలకు ఆయన ఆదేశాలిచ్చారు. భారీ వర్షాలతో కొద్ది రోజుల పాటు సింగరేణిలో ఉత్పత్తి నిలిచిపోగా, వార్షిక లక్ష్యాన్ని చేరుకోవడంలో భాగంగా ఈ లక్ష్యాన్ని నిర్ధేశించారు.

● నల్లబ్యాడ్జీలతో కేటీపీపీ ఉద్యోగుల నిరసన

థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణాలను జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని, సింగరేణి భాగస్వామ్యాన్ని అంగీకరించబోమని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ పేర్కొంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరులోని కేటీపీపీలో శనివారం ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. - గణపురం

# చేనేత రుణమాఫీ ఏమాయే..!

- ఇచ్చిన హామీని బుట్టదాఖలు చేస్తున్న కాంగ్రెస్ సర్కారు
- తీవ్ర ఆవేదనలో చేనేత కార్మికులు

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చేనేత కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేనేత కార్మికుల వ్యక్తిగత రుణాలు మాఫీ చేస్తామని మాట ఇచ్చిన ప్రభుత్వం.. ఇంతవరకు పట్టించుకోకపోవడమే ఇందుకు కారణమవుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదాపు 10 వేల మంది కార్మికులు ఈ మాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 'చేనేత పాలసీ' అనేది ఏదీ లేదని చేనేత కార్మికులు మండిపడుతున్నారు. చేనేతలను సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని చేనేత కార్మికసంఘం రాష్ట్ర నాయకులు కూరపాటి రమేశ్, చెరుకు స్వామి విమర్శిస్తున్నారు. మరికొన్ని డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు.

- చేనేత, పవర్‌లూమ్ కార్మికులకు ఉపాధి కల్పించాలి.
- చేనేతల కోసం రూ.1000 కోట్ల బడ్జెట్ కేటాయించాలనే డిమాండ్‌ను నెరవేర్చాలి
- త్రిఫ్ట్ ఫండ్, యూరన్ సబ్సిడీ, నేతన్నకు బీమా పథకాలు అమలు చేయాలి
- బకాయిలు వెంటనే విడుదల చేయాలి
- వస్త్రనిల్వలు వెంటనే కొనుగోలు చేయాలి
- వర్కర్ టూ ఓనర్, జనతా వస్త్ర పథకాలను అమలు చేయాలి
- పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి
- యూరన్ సబ్సిడీ నిధులను కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమచేయాలి
- ప్రతి నేతన్నకు పెట్టుబడిసాయం కింద రూ.5 లక్షలు అందించాలి
- ప్రభుత్వ రంగ సంస్థలకు అవసరమైన వస్త్రాలను రాష్ట్రంలో ఉత్పత్తి చేయించాలి.

# టీ కొట్టు శివకు ఐదు కొలువులు

- పోటీ పరీక్షల్లో పెద్దపల్లి జిల్లా ధర్మారం యువకుడి సత్తా
- గత మార్చిలో గురుకుల జేఎల్, పీజీటీ, టీజీటీల్లో ప్రతిభ
- తాజాగా జేఎల్, డీఎస్సీలో విజయ ధంకా

మహేశ్ కుమార్

ధర్మారం, అక్టోబర్ 5: ఓ పేదింటి బిడ్డ.. ప్రభుత్వ కొలువులు కొల్లగొట్టాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులతో కొన్నాళ్లు టీకొట్టు నడిపిన పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రానికి చెందిన ఉడాన్ శివ మహేశ్ కుమార్.. ఆరు నెలల్లోనే ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి సత్తాచాటాడు. ధర్మారానికి చెందిన ఉడాన్ సుశీల-లక్ష్మణ్ దంపతులకు శివ మహేశ్ రెండో కొడుకు. ధర్మారంలో చదువుకుంటూనే తల్లిదండ్రులకు సాయపడేవాడు. 2014లో సునీతను వివాహం చేసుకున్నాడు. 2020లో పీజీ పూర్తిచేశాడు. కరోనా టైంలో రాజారాంపల్లిలో టీకొట్టు నడిపాడు. తర్వాత దానిని వదిలేసి తల్లిదండ్రులు, మిత్రుల సహకారంతో 2022లో జూనియర్ లెక్చరర్ ఉద్యోగం కోసం కోచింగ్ తీసుకున్నాడు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2023లో గురుకులాల లెక్చరర్, టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా.. అదే ఏడాది ఆగస్టులో పరీక్షలు రాశాడు. గత మార్చిలో ఫలితాలు రాగా.. జూనియర్ లెక్చరర్, పీజీటీ, టీజీటీ కొలువులకు ఎంపికయ్యాడు. జూనియర్ లెక్చరర్ పోస్టును ఎంపిక చేసుకొని ప్రస్తుతం నిర్మల్ జిల్లా మామడలోని గురుకులంలో పనిచేస్తున్నాడు. అలాగే గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 సెప్టెంబర్‌లో నిర్వహించిన ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ ఉద్యోగాల భర్తీ పరీక్ష, ప్రస్తుత ప్రభుత్వం ఆగస్టు 2024లో నిర్వహించిన డీఎస్సీ పరీక్షలు రాసి ప్రతిభ చాటాడు. ఇటీవలే విడుదలైన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంక్, డీఎస్సీ ఫలితాల్లో పెద్దపల్లి జిల్లాలో ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. ఈ విజయం తన తల్లిదండ్రులకే అంకితమని శివమహేశ్ తెలిపారు.

## నిలిచిన స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల వెరిఫికేషన్

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): పలు జిల్లాల్లో డీఎస్సీలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిలిచిపోయింది. కొన్ని జిల్లాల్లో ఇంకా 1:3 జాబితాలు విడుదల కాలేదు. కోర్టుకేసుల కారణంగా నిలిచినట్టు అధికారులు ప్రకటించారు. శనివారం వరకు (ఎస్జీటీ), స్కూల్ అసిస్టెంట్, భాషాపండితులు, పీఈటీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తికాగా, స్పెషల్ ఎడ్యుకేషన్ వెరిఫికేషన్ పూర్తికాలేదు. కోర్టుకేసులు లేని జిల్లాల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పూర్తిచేశామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి తెలిపారు.

- నల్లగొండలో ఎస్‌జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తికాలేదు. కానీ ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ జాబితాలో 31కి 29 మంది హాజరయ్యారు.

హరీశ్ (ఫైల్) | సురేశ్ (ఫైల్) | హేమలత (ఫైల్)

# ఆన్‌లైన్ బెట్టింగ్‌కు కుటుంబం బలి

- రూ.30 లక్షలకుపైగా కుమారుడి అప్పులు
- 20 గుంటల భూమి అమ్మి అప్పుల చెల్లింపు
- మనస్తాపంతో కుమారుడితోపాటు తల్లిదండ్రుల ఆత్మహత్య
- నిజామాబాద్ జిల్లా వడ్డేపల్లిలో విషాదం

ఎడపల్లి, అక్టోబర్ 5: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు మరో కుటుంబం బలైంది. రూ.లక్షలు పోగొట్టిన ఓ యువకుడితోపాటు అతడి తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన శనివారం నిజామాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. ఎడపల్లి మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన రంగణవేణి సురేశ్ (55), హేమలత (48) దంపతులకు ఇద్దరు సంతానం. మెదడు వాపు వ్యాధితో కూతురు చిన్నప్పుడే మృతి చెందింది. ఏకైక కుమారుడు హరీశ్ (22) నిజామాబాద్‌లో ఉంటూ పెట్రోల్ బంక్‌లో పని చేసేవాడు. ఆర్నెళ్ల క్రితం పని మానేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. సురేశ్ దంపతులు చిన్న కిరాణషాపు నడుపుతూ వ్యవసాయ కూలీలుగా పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. కొత్త ఇల్లు కట్టుకుందామన్న ఆశతో గృహ నిర్మాణాన్ని ప్రారంభించారు. కుమారుడు హరీశ్ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి భారీగా అప్పులు చేశాడు. దీంతో తల్లిదండ్రులు ఇంటి నిర్మాణాన్ని ఆపేశారు. హరీశ్ చేసిన రూ.30 లక్షలకుపైగా అప్పులను తమకున్న 20 గుంటల భూమిని అమ్మేసి తీర్చారు. అయినప్పటికీ కుమారుడిలో మార్పు రాలేదు. నలుగురిలో తిరగలేక మనస్తాపం చెందిన తల్లిదండ్రులు, కుమారుడు శుక్రవారం రాత్రి ఉరేసుకున్నారు. తెల్లారినా ఎలాంటి అలికిడి లేకపోవడంతో ఇరుగుపొరుగు ఇంటి వెనుక నుంచి చూడగా వేలాడుతూ కనిపించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బోధన్ దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఉగాండాలో జనగామవాసి హత్య

### సెక్యూరిటీ గార్డు జరిపిన కాల్పుల్లో ప్రాణాలొదిలిన తిరుమలేశ్

తిరుమలేశ్ (ఫైల్)

జనగామ చౌరస్తా, అక్టోబర్ 5 : ఉగాండా దేశంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ప్రాజెక్ట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న జనగామవాసి ఇటికాల తిరుమలేశ్ (41) శుక్రవారం అక్కడ హత్యకు గురయ్యాడు. మృతుడి తమ్ముడు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా కేంద్రంలోని గిర్నిగడ్డ ఏరియాకు చెందిన తాపీ మేస్త్రీ ఇటికాల కిష్టయ్య-కిష్టమ్మ దంపతుల పెద్ద కుమారుడు తిరుమలేశ్ నల్లగొండ జిల్లాకు చెందిన రాయల్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 2014 నుంచి ప్రాజెక్ట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఈ కంపెనీకి ఉగాండాలోని నమ్మసాలలో బ్రాంచ్ కార్యాలయం ఉండటంతో 15 నెలల నుంచి భార్య, కుమారుడితో కలిసి తిరుమలేశ్ అక్కడే ఉంటున్నాడు. గురువారం ఉదయం 9.30 గంటలకు (ఉగాండా కాలమానం ప్రకారం) డ్యూటీకి వెళ్లాడు. అక్కడ కొత్తగా విధుల్లో చేరిన సెక్యూరిటీ గార్డు ఓపియో మద్యం మత్తులో గాల్లోకి కాల్పులు జరుపుతుండగా సహోద్యోగులతో కలిసి తిరుమలేశ్ బయటకు వచ్చాడు. సెక్యూరిటీగార్డు విచక్షణ కోల్పోయి తిరుమలేశ్‌పైకి కాల్పులు జరపగా ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో తిరుమలేశ్ భార్య సునీత, కుమారుడు వరుణ్ ఉగాండాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. కాగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫోన్‌లో వారిని పరామర్శించారు.

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

## మంచినీటి కొరత నివారణకు కృషి చేయాలి

### అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

పెంబి, అక్టోబర్ 5 : ప్రతి గ్రామంలో మంచినీటి కొరత నివారణకు మంచినీటి సహాయకులు కృషి చేయాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో మిషన్ భగీరథ ఆధ్వర్యంలో నిర్వహించిన మంచినీటి సహాయకుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. చేతి పంపులు, మిషన్ భగీరథ పైపులైన్, మోటార్ల మరమ్మతులను ఎలా పరిష్కరించాలో సహాయకులకు మిషన్ భగీరథ సిబ్బంది శిక్షణ ఇచ్చారు. అనంతరం శిక్షణ పొందిన మంచినీటి సహాయకులకు సర్టిఫికేట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమాకాంత్, ఎంపీవో అనిల్‌కుమార్, మిషన్ భగీరథ ఈఈ సందీప్, డీఈలు హరీశ్, వెంకటరమణ, ఏఈలు విష్ణు, మనోజ్‌లు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్ రూరల్, అక్టోబర్ 5: మండలంలోని గిరిజన ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో 2024 సంవత్సరానికిగాను ఆరో విడుత వాక్ ఇన్ అడ్మిషన్ కొరకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో చేరుటకు 8, 10వ తరగతి ఉత్తీర్ణులై, 01 ఆగస్టు 2024 నాటికి 14 సంవత్సరాలు నిండిన వారు https:// iti. telangana. gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు ఉదయం 11 గంటల లోపు ఒరిజిల్ సర్టిఫికెట్లు స్కాన్ చేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం కళాశాలలో రిపోర్టు చేయాలని తెలిపారు.

## 9న నల్ల జెండాలతో ఎమ్మార్పీఎస్ ప్రదర్శన

ఇచ్చోడ, అక్టోబర్ 5 : ఎస్సీ వర్గకరణ లేకుండా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 9వ తేదీన నిర్వహించే ఆదిలాబాద్‌లో నల్ల జెండాలతో ఎమ్మార్పీఎస్ భారీ ప్రదర్శనను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేశ్ మాదిగ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పును స్వాగతించి ఇచ్చిన ప్రతి నోటిఫికేషన్‌లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని అసెంబ్లీలో హామీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి, 11062 ఉపాధ్యాయ పోస్టులను ఎస్సీ వర్గీకరణ లేకుండా అమలు చేయడం మాదిగ జాతికి నమ్మక ద్రోహం చేయడమే అన్నారు. ఈ నెల 9న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అంబేద్కర్ విగ్రహాల వద్ద నుంచి కలెక్టర్ కార్యాలయాల వరకు నల్ల జెండాలతో భారీ ప్రదర్శనలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమాన్నికి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర నాయకుడు సిరిసిల్ల భూమయ్య, జిల్లా కార్యదర్శి జనారపు సాయి, కాశిపాక విష్ణు, మచ్చ గంగయ్య, రమేశ్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పసుల శ్రీకాంత్, అజయ్, వెంకటేశ్, భూమన్న, రవి, శ్రీను, నర్సింగ్ పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లు పూర్తి చేయాలి

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 5 : వానకాలపు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లు పూర్తి చేయాలని నిర్మల్ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ సీజన్ నుంచే సన్న రకపు ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. సన్నరకం, దొడ్డురకం ధాన్య సేకరణ కేంద్రాలను వేర్వేరుగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో తగినంత మంది సిబ్బందిని నియమించుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఎం సివిల్ సప్లయి వేణుగోపాల్, డీఎస్వో కిరణ్‌కుమార్, డీఆర్డీవో విజయలక్ష్మి, ఏడీ మార్కెటింగ్ శ్రీనివాస్, రైస్ మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# కొనుగోళ్లపై పకడ్బందీ చర్యలు తీసుకోవాలి

మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, అక్టోబర్ 5 : పత్తి కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించేందుకు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. కొనుగోళ్ల సన్నద్ధత, ముందస్తు ఏర్పాట్లపై అధికారులు, జిన్నింగ్ మిల్ యజమానులు, లారీ అసోసియేషన్, సీసీఐ, ఏఎంసీ ట్రాన్స్‌పోర్ట్ అధికారులతో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలదేవి, అదనపు ఎస్పీ సురేందర్, డీఎస్పీ జీవన్ రెడ్డితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిన్నింగ్ మిల్ యజమానులు, సీసీఐ, ఏఎంసీ, ఖరీఫ్ సీజన్ 2024-25కు సంబంధించిన పత్తి కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, జిరాక్స్, తాగునీరు, టెంట్, కుర్చీలు ఏర్పాటు చేయాలని కోరారు. హెల్ప్ లైన్, సిబ్బంది కొరత లేకుండా చూడాలని, రోడ్ల మరమ్మతులు చేయించాలని, కమిటీ ఏర్పాటు వంటి అంశాలపై వారి అభిప్రాయాలు, సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గతంలో జరిగినవి పునరావృతం కాకుండా ఈసారి పకడ్బందీ చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది కొరత ఉన్న వివరాలను పంపాలని, జిన్నింగ్ మిల్లులలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందా లేదా తనిఖీ చేయడం, అన్ని చోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు, హెల్ప్ లైన్ నెంబర్ ఏర్పాటు, తదితర పరిశీలించాలని ఏడీ మార్కెటింగ్‌ను ఆదేశించారు. మార్కెట్ రేటునే పాటించాలని, ట్రాన్స్‌పోర్ట్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, ట్రాన్స్‌పోర్ట్, లారీ అసోసియేషన్‌లతో మరొకసారి సమావేశం నిర్వహించాలని, హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. అలాగే రైతుల బ్యాంక్ అకౌంట్ పని చేస్తుందో లేదో చూడాలని, దీనికి సంబంధించి డీవీటీ భారత్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు.

## కుటుంబ సర్వేను పక్కగా నిర్వహించాలి

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 5 : డిజిటల్ కార్డు సర్వే పూర్తిస్థాయిలో పక్కగా నిర్వహించాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రత్యేకాధికారి ఇలంబరిది అధికారులను ఆదేశించారు. శనివారం రాత్రి కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ఆయన డిజిటల్ కార్డుల సర్వేపై ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించే విధంగా ప్రభుత్వం జారీ చేయనున్న కుటుంబ డిజిటల్ కార్డుల సర్వేను నిర్వహించాలని సూచించారు. కుటుంబంలోని వ్యక్తుల పేర్లు జండర్, పుట్టిన తేదీ, వయస్సు, కుటుంబంతో ఉన్న సంబంధం, ఫొటో, ఆధార్ నంబర్, చిరునామా వివరాలు నమోదు చేయాలన్నారు. మున్సిపాలిటీలు, పంచాయతీలలో నిర్వహించిన సర్వేలో ఏమైనా సమస్యలున్నాయా అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో నిర్మల్, ఆదిలాబాద్, భైంసా ఆర్డీవోలు రత్న కళ్యాణి, వినోద్‌కుమార్, కోమల్‌రెడ్డి, జడ్పీ సీఈవో గోవింద్, జితేందర్‌రెడ్డి, డీపీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రాజు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

కలెక్టర్, అధికారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ఇలంబరిది

## అమ్మవారిని దర్శించుకున్న డీపీవో

అమ్మవారిని దర్శించుకుంటున్న డీపీవో

బాసర, అక్టోబర్ 5 : బాసర సరస్వతీ అమ్మవారిని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా పంచాయతీరాజ్ అధికారి శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అధికారులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సిబ్బందికి పారిశుధ్యంపై పలు సూచనలు చేశారు. ప్రధాన రోడ్డు పరిసరాలను పరిశీలించారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి డంప్‌యార్డుకు తరలించాలని, మురుగు కాలువలు, తాగునీటి కుళాయిలను శుభ్రంగా ఉంచాలని, ఎక్కడబడితే అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా దుకాణ సముదాయాల ముందు వ్యాపారులు రోడ్లపై చెత్తను వేయకుండా చూడాలని ఈవో గోవిందరాజుకు సూచించారు. ఆయన వెంట ఎల్‌పీవో సుదర్శన్, ఎంపీవో గంగాసింగ్, సిబ్బంది ఉన్నారు.

మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్ రాజర్షి షా

## కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబురాలు

ఎదులాపురం, అక్టోబర్ 5: ఆదిలాబాద్ కలెక్టరేట్ ఆవరణలో శనివారం రాత్రి మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి హాజరయ్యారు. బతుకమ్మ పూజలు చేశారు. మహిళలతో కలిసి బతుకమ్మ పాటలపై నృత్యం చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

## మొరం అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఖానాపూర్ టౌన్, అక్టోబర్ 5: ఖానాపూర్ లోని ప్రభుత్వ భూమిలో నుంచి అక్రమంగా మొరం తరలించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం అన్నారు. కుమ్రం భీం చౌరస్తాలో గల అక్రమంగా తవ్వకానికి గురైన ప్రభుత్వ భూమిని కాంగ్రెస్ నాయకులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొందరు ధనార్జనే ధ్యేయంగా ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తరలిస్తూ విలువైన భూములను పనికి రాకుండా చేస్తున్నారన్నారు. అక్రమంగా మొరం తీయడం వల్ల ఏర్పడిన గుంతలను మైనింగ్ అధికారులు సర్వే నిర్వహించి తీసిన వ్యక్తులచే పూడ్చి విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌తో సహా మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఈ విషయమై తహసీల్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. మొరం తవ్వకాలపై ఇది వరకే జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ వారితో తెలిపారు. ఇక్కడ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దయానంద్, పట్టణ అధ్యక్షుడు రమేశ్, నాయకులు సత్యం, షబ్బీర్ పాషా, శేషాద్రి ఉన్నారు.

చంద్రఘంట రూపంలో అమ్మవారు

## చంద్రఘంట రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు

బాసర, అక్టోబర్ 5 : బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగ కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన శనివారం సరస్వతీ అమ్మవారు చంద్రఘంట రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారికి కొబ్బరి అన్నం నైవేద్యంగా అర్చకులు సమర్పించారు. సరస్వతీ అమ్మవారిని దర్శించుకుని భక్తులు తమ చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు జరిపించారు. నేడు(ఆదివారం) కుష్మాండ రూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

## గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్,5: నిర్మల్ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐదు గెస్ట్ లెక్చరర్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఐఈవో పరశురాం ఒక ప్రకనటలో తెలిపారు. ఇంగ్లిష్ (2), తెలుగు (3), కెమిస్ట్రి (4), జువాలజి(1), ఎకానమిక్స్(1) పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు సంబంధిత డ్రువీకరణ పత్రాల జిరాక్స్ ప్రతులపై గెజిటెడ్ అటెస్ట్ చేసిన రెండు సెట్లు బయోడేటా ఫాంతో ఈ నెల 9 లోపు నిర్మల్ డీఐఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభం

నర్సాపూర్ (జీ), అక్టోబర్ 5 : ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కోసం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర